క్లుప్తంగా

ఘనంగా తలుపులమ్మ తల్లి పండగ



తలుపులమ్మ తల్లి

నాతవరం: మండలంలోని వెన్నలపాలెం, మర్రిపాలెం, డి.యర్రవరం గ్రామాల్లో గురువారం తలుపులమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు ఎండలో సైతం భక్తులు గంటల కొద్దీ క్యూలో నిలబడ్డారు. ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని, ఆలయ ప్రాంగణమంతా పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. రాత్రికి కనులు మిరుమిట్లు గొలిపే విధంగా మందుగుండు సామగ్రిని కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చెర్లోపాలెంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ శిరీష

నాతవరం: వేసవి దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసామని సర్పంచ్ పైల శిరీష తెలిపారు. చెర్లోపాలెంలో చలివేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



గోడపత్రికలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

రోలుగుంట: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. రోలుగుంటలో గురువారం వారు గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండలాధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ రైతన్నలకు వ్యతిరేకంగా పని చేస్తోందని, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించడం లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో గద్దె దింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మల్లేష్, జగదీష్, లక్ష్మి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన క్రికెట్ పోటీలు



ప్రథమ స్థానం సాధించిన టీంతో నిర్వాహకులు

మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలో ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మండల వ్యాప్తంగా పలు జట్లు పాల్గొన్నాయి. ఇందులో ప్రథమ స్థానం సాధించిన సహస్ర టీంకు రూ.45,000, ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న బుల్లెట్ బాక్సర్స్ టీంకు రూ.25,000 ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, కోసూరు శ్రీను, అయ్యప్ప, నిర్వాహకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి 30 వరకు గడువు

కె.కోటపాడు: గొల్లలపాలెంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రత్యేకాధికారి బి.చిన్నమ్మలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో చేరే విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బడిబయట విద్యార్థినులకు తల్లిదండ్రులు లేని చిన్నారులకు సీట్ల మంజూరులో మొదటి ప్రాధాన్యమిస్తామన్నారు.

ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



బూడి ముత్యాలనాయుడిని దుశ్శాలువాతో సత్కరిస్తున్న ముస్లింలు



రిబ్బన్ కట్ చేసి డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం తమదని, అందుకే కులం, మతం, పార్టీ, ప్రాంతం, వర్గం అనే తేడా లేకుండా మన జగనన్న సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెదగోగాడ పంచాయతీలోని 224 కుటుంబాలను గురువారం ఆయన కలిశారు. సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు సత్వర న్యాయం అందడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఏళ్ల తరబడి పరిష్కారంకాని డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలకు తక్షణమే ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రూ. 20 లక్షలు కేటాయిస్తామన్నారు. రూ. 50 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలోని 1034 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో రూ 4,90,36,515 కోట్లు నేరుగా లబ్ధి కలిగిందని వివరించారు. కనక మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం నిర్మాణానికి రూ.40 లక్షల అందిస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ పిల్లలతో ముచ్చటించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విశాఖ డైయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి రూ.16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైల అచ్చియ్యమ్మ, ఎంపీటీసీ కొల్లి నాగమణి, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు, ఎంపీడీవో జయప్రకాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్‌కు డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

చీడికాడ: కె.జె.పురం మసీదుకు చెందిన చీడికాడ మండల యూనిట్ ముస్లింలు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని కలిసి రంజాన్ వేడుకలకు ఆహ్వానించారు. గురువారం పెదగోగాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బూడిని వారంతా మర్యాద పూర్వకంగా కలిశారు. మసీదు ప్రెసిడెంట్ సూరిబాబు, జనరల్ సెక్రటరీ షేక్ సూర్యనారాయణ, మస్తాన్ అలీఖాన్, సలీమ్, పెదబాబు, తదితరులు దుశ్శాలువాలతో సత్కరించారు.

మేడివాడలో లోవోల్టేజీ సమస్య పరిష్కరిస్తాం

- ట్రాన్స్‌కో డీఈ సురేష్‌బాబు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈ సురేష్‌బాబు

రావికమతం: మేడివాడలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి శుక్రవారం నుంచే పనులు ప్రారంభిస్తామని ట్రాన్స్‌కో నర్సీపట్నం డీఈ సురేష్‌బాబు స్పష్టం చేశారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని రావికమతం సబ్ స్టేషన్ వద్ద గ్రామస్తులు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన డీఈ గురువారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఎక్కడెక్కడ లూప్ పాయింట్లు ఉన్నవి, సమస్య తలెత్తే ప్రదేశాలను ఆయన సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సత్యారావు, సర్పంచ్ భర్త శివ, ఇతర నాయకులతో మాట్లాడారు. సిబ్బంది కొరత వల్ల జాప్యమైందని, వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు వేసి శతశాతం సమస్య పరిష్కరిస్తామన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని పరికరాల ఉపయోగాలు వివరిస్తున్న ఫైర్ అధికారి రాజేశ్వరరావు



ముగింపు సభలో మాట్లాడుతున్న అధికారి

చోడవరం రూరల్: అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యల గురించి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ముగింపు సభకు ఫైర్ ఆఫీసర్ బి.వి.రామస్వామి అధ్యక్షత వహించగా, నర్సయ్యపేట సర్పంచ్ యు.నాగబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విపత్తు సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది చూపే చొరవ, ధైర్య సాహసాలను వక్తలు కొనియాడారు. వందలాది మంది అగ్నిమాపక సిబ్బంది, పౌరులు ముంబైలో జరిగిన నౌకా విస్ఫోటనంలో అసువులు బాసిన దుర్ఘటనకు సానుభూతిగా ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ప్రసాదు, డి.నూకరాజు, సి.ఎం.నాయుడు, కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల: ఈ నెల 14న ప్రారంభమైన జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయని ఫైర్ అధికారి రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శకటంలో భాగాలు, గ్యాస్ తదితర అగ్ని ప్రమాదాల నివారణకు వాడే పరికరాలు, రోప్‌లు తదితర వాటిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ కృష్ణ, ఫైర్‌మెన్ మణికుమార్, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు పనుల్లో జాప్యం చేయొద్దు

- అవసరమైన క్లియరెన్స్ త్వరితగతిన ఇవ్వాలి
- అధికారులతో ఎమ్మెల్యే గణేష్ సమీక్ష



తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కోట్ల రూపాయలు వెచ్చించి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి నిర్ణీత వ్యవధిలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేయకపోతే ప్రయోజనం లేదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం రూ.166.85 కోట్లతో చేపట్టిన భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులను ఆయన సమీక్షించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం, ప్రాజెక్టు డీఈ మహేష్, ఇరిగేషన్ డీఈ స్వామినాయుడు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు నిర్ణీత వ్యవధిలోపు ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలో 175 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయాల్సి ఉండగా, ప్రస్తుతం 120 కిలోమీటర్ల మేర వేశామని, పట్టణంలో రిజర్వాయర్ల పనులు జరుగుతున్నాయని డీఈ వివరించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తోపాటు జోగునాధునిపాలెం వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారులను సమన్వయం చేసుకుని ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా క్లియరెన్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్డీవోకు సూచించారు. మూడు శాఖల అధికారులను సమన్వయం చేసుకుని శుక్రవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి పనులు శరవేగంగా జరిగేందుకు అవసరమైన క్లియరెన్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లిదొర, బోడపాటి సుబ్బలక్ష్మి, వీరమాచినేని జగదీశ్వరి, బయపురెడ్డి చినబాబు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, యాదగిరి శేష్, లగుడు స్వామి పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి

బుచ్చెయ్యపేట: వడ్డాది ఈబీసీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీ మహిళలు గురువారం నిరసనకు దిగారు. ఇటీవల కేజీబీవీ నుంచి ఈబీసీ కాలనీ మీదుగా సిమెంట్ కాలువ నిర్మాణానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. దీని వల్ల ఈగలు, దోమలు పెరిగి అనారోగ్యం పాలవుతామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు.

వైఎస్సార్ పోషణ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీటీసీ ఆర్లె మాధవి

మాడుగుల రూరల్: జి. అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు గురువారం సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ పోషణ్ పథకం ప్రయోజనంపై ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, సర్పంచ్ నందారపు మంగమ్మ వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని సూపర్‌వైజరు రమణి సూచించారు. కార్యకర్తలు వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, కాసులమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ లాభాలార్జనకు కృషి



సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న సత్యనారాయణ మూర్తి, జగన్‌మోహన్, అనురాధ, శివాజీరాజు

కె.కోటపాడు: చౌడువాడ పీఏసీఎస్‌ను లాభాల బాటలో పయనించేలా నూతనంగా నియమితులైన పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయి ప్రసాద్, డైరెక్టర్లు బండారు నాగేశ్వరరావు, యడ్ల సూరిదేముడు కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ మూర్తి ఆకాంక్షించారు. గురువారం స్థానిక సొసైటీ ఆవరణలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ముఖ్య అతిథులుగా చల్లా సత్యనారాయణ మూర్తి, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు దుశ్శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మాజీ సర్పంచ్ బండారు రామస్వామిపాత్రుడు, వారాధి అప్పారావు, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, చల్లా సురేష్ పాల్గొన్నారు.

30లోగా ఈకేవైసీకి అవకాశం



మాట్లాడుతున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: పీఎం కిసాన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులంతా ఈ నెల 30లోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ ప్రక్రియ చేసుకోకపోవడం వల్ల పలువురు రైతులకు 13, 14 విడత నగదు జమ కాలేదన్నారు. మండలంలో పీఎం కిసాన్‌కు 11,500 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 9,150 మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారన్నారు. మిగిలిన 2,350 మంది రైతులు ఈ నెల 30లోగా సమీప రైతు భరోసా కేంద్రాల్లో లేదా నెట్ సెంటర్లలో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. గతంలో రైతు భరోసా నగదు జమ కాకపోయిన, కొత్త పట్టాదారు పాసు పుస్తకం తీసుకున్న వారికి, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఉన్న వారు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. భూమి పట్టాదారు పాసుబుక్ ఉండి ఆ వ్యక్తి మరణిస్తే నామినీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసేందుకు డెత్ సర్టిఫికెట్, ఆధార్ జెరాక్స్, నామినీ ఆధార్, బ్యాంక్ బుక్ జెరాక్స్‌లు, వన్‌బి ధ్రువ పత్రంతో ఆర్బీకేలకు వెళ్లాలని సూచించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం వంశీ

మాడుగుల: హెచ్ఎం వంశీ ఆధ్వర్యంలో జంపెన ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన మానస సంస్థ సెక్రటరీ పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలతో మంచి చదువులు చదువుకుని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పలు ఆటలు, నృత్య పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ గురువునాయుడు, కమిటీ చైర్మన్ పి.అప్పారావు, ఉపాధ్యాయిని రజని పాల్గొన్నారు.

వలసలు పోకుండా ఉపాధి పనులు



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

బుచ్చెయ్యపేట: పొట్టకూటి కోసం దూరప్రాంతాలకు వలసలు పోకుండా స్వగ్రామాల్లోనే ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తుందని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. వడ్డాదిలోని పాండవుల చెరువులో రూ.40 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. వేతనదారులకు సకాలంలో కూలి అందేలా చూడాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఏపీవో మురళి, ఈసీ కొండాజీలకు సూచించారు. కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి దొండా సన్యాసిరావు, నాయకులు కోరుకొండ రమణ, శంకర్రావు, వీర్ల సురేష్ పాల్గొన్నారు.

రెండు వందల పనిదినాలు కల్పించాలని నిరసన..

మాడుగుల రూరల్: గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉపాధి కూలీలతో నిరసన వ్యక్తం చేశారు. కింతలి, వల్లాపురం, చినగొర్రెగెడ్డ, సీతబందలలో వేతనదారులతో సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి ఏడాదికి రెండు లక్షల 40 వేల కోట్ల రుపాయలు కేటాయించాలని, రెండు వందల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కె. భవాని పాల్గొన్నారు.

అనుమానితులపై సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎస్సై ధనుంజనాయుడు

నర్సీపట్నం: వీధుల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని టౌన్ ఎస్సై ధనుంజయనాయుడు తెలిపారు. నర్సీపట్నం క్రైమ్ పార్టీ సిబ్బంది మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి యాతపేటలో చోరీలు, నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరుబయట పడుకునేటప్పుడు ఇంటికి తాళాలు వేసుకుని పడుకోవాలన్నారు. క్రైమ్ స్పాట్ ఇంచార్జ్ కె.శ్రీనివాస్, సిబ్బంది భరత్, యుంగధరరావు పాల్గొన్నారు.

చోడవరం సబ్ జైలర్‌గా సింహాచలం నాయుడు



చోడవరం: స్థానిక సబ్ జైలు సూపరింటెండెంట్ వై. సింహాచలంనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇక్కడి హెడ్ కానిస్టేబుల్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తాజాగా జైళ్ల శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా విశాఖపట్నం సెంట్రల్ జైలులో పనిచేస్తున్న సింహాచలం నాయుడు నియమితులయ్యారు. ఆయనను సిబ్బంది అభినందించారు.

సంక్షేమ పాలనలో ఎనలేని ఆనందం



బుచ్చెయ్యపేట: శింగవరంలో సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న నాయకులు

మాడుగుల రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలు ఎనలేని ఆనందం వ్యక్తం చేస్తున్నారని శంకరం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు శోలం రమేశ్ తెలిపారు. శంకరం పంచాయతీ పరిధి కృష్ణంపాలెం, కొత్తవలస, బొడ్డరేవు, తాడివలస, రాయిపాలెం, తదితర గ్రామాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు ఉబ్బేటి రక్షకుడు, ఈశ్వరమ్మ, గృహ సారథులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి గ్రామాల్లో విశేష ఆదరణ లభిస్తోంది. శింగవరం, వడ్డాది, ఆర్. భీమవరం, లోపూడి శివారు బంగారుమెట్ట, ఎల్.బి. పురం, పీడీ పాలెం, కుముదాంపేట తదితర గ్రామాల్లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ఎంతో మేలు చేకూరుతుందని ఆనందం వ్యక్తం చేస్తూ జగనన్న స్టిక్కర్లను లబ్ధిదారులే స్వయంగా తమ ఇళ్లకు అంటిస్తున్నారు. సర్పంచ్‌లు, నాయకులు అమ్మునాయుడు, వాసు, సత్యనారాయణ, రమణ, మధు, సోమునాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఆర్లిలో గృహసారథులు, వలంటీర్లతో కలిసి సచివాలయ కన్వీనర్ బోళెం దుర్గ గురువారం ఇంటింటికి తిరిగారు. చంద్రబాబు పాల నలో ప్రజలను మోసగించిన అంశాలను తెలిపారు. ఆయా కుటుంబాల అంగీకారంతో మిస్డ్‌కాల్, ఇంటికి, సెల్ ఫోన్‌కు స్టిక్కర్లను అంటించారు. సర్పంచ్ బోళెం సందీప్, బోళెం సత్యనారాయణ, వరలక్ష్మి, కవి, శ్రీనివాసరావు, కొరుపోలు దేముళ్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ నిధుల దుర్వినియోగంపై విచారణ

నర్సీపట్నం: స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో, సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.ఉషారాణి గురువారం ఇక్కడ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సీడీపీవో మేరీ సువార్త సొంత కారును వినియోగించి ప్రభుత్వ వాహనంగా చూపించి నిధులు డ్రా చేశారని, కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్ ఇతర వ్యాపారులు చేసుకుంటూ తనకు బదులుగా వేరొకరితో పని చేయిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. దీనిపై ఫిర్యాదుదారులను, కార్యాలయ సిబ్బందిని విచారించారు. విచారణ నివేదికను ఆర్జేడీకి అందజేస్తానని పీడీ తెలిపారు.

సెల్‌టవర్ నిర్మాణంపై అభ్యంతరం



ఈవోపీఆర్డీతో మాట్లాడుతున్న ఎంపీపీ

మాకవరపాలెం: ఇళ్ల సమీపంలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని శెట్టిపాలెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇక్కడ ఇటీవల సెల్ టవర్ నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్లకు చేరువలో దీన్ని నిర్మించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి గురువారం గ్రామంలో విచారణ చేపట్టారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోనూ ఎంపీపీ రుత్తల సత్యనారాయణతో కలిసి గ్రామస్తులు ఈవోపీఆర్డీకి వినతి పత్రం ఇచ్చారు. నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సదరు అధికారి తెలిపారు.

అర్హులకే మిషన్ వాత్సల్య వర్తింపు



ఐసీడీఎస్ పీడీ ఉషారాణి

నర్సీపట్నం: అర్హులకే మిషన్ వాత్సల్య పథకం వర్తింపజేస్తామని ఐసీడీఎస్ పీడీ జి.ఉషారాణి తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం నర్సీపట్నం విచ్చేసిన ఆమె మాట్లాడుతూ పథకానికి నిర్దిష్టమైన సమయం లేదని, ప్రతి నెలా లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు సీడీపీవో, సూపర్‌వైజర్, మహిళా పోలీసుతో కమిటీలను వేశామన్నారు. వేసవి వల్ల కొన్ని ప్రాజెక్టుల్లో పాల కొరత ఉందన్నారు. లబ్ధిదారులకు ప్రాధాన్య క్రమంలో పాలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. లబ్ధిదారుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా సెక్టార్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పదార్థాలు తీసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సెల్ ఫోన్లో సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టిందన్నారు. సర్వర్, యాప్ వల్ల తలెత్తే సమస్యలను పరిశీలించి మెరుగైన విధానాన్ని తీసుకువస్తామన్నారు. సీడీపీవో కె.మేరీసువార్త పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి

- వైద్య సిబ్బంది రాలేదని బంధువుల ఆరోపణ

చీడికాడ: కోనాం శివారు కొత్తవీధి గ్రామానికి చెందిన ఏడాది బాలికకు సకాలంలో వైద్య సేవలందక బుధవారం రాత్రి మృతి చెందినట్లు చిన్నారి మేనమామ గెమ్మిలి చంటి ఆరోపించారు. గురువారం ఆయన అందించిన వివరాల ప్రకారం .. తన మేనకోడలు చౌడపల్లి సంయుక్త(1) నాలుగు రోజుల క్రితం అనారోగ్యం బారిన పడింది. వైద్య సిబ్బందే తమ మారుమూల గిరిజన గ్రామానికి వచ్చి సేవలందిస్తారు. కొద్ది రోజులుగా వారు రాలేదు. దీంతో సకాలంలో వైద్యం అందక బాలిక మృతి చెందింది. దీనిపై చీడికాడ పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస్‌ను వివరణ కోరగా, బాలిక మృతి విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తామన్నారు.